
# అమరావతి కథలు

### సత్యం శంకరమంచి



## లేగదూడ చదువు

తెలతెలవారుతుండగా ఇళ్ళల్లో చల్ల చిలికే వేళ. తల్లులు పిల్లల్ని 'లేవండ్రా' అంటుంటే వాళ్ళు దుప్పట్లు ఇంకా బిగదీసుకు పడుకుంటున్నారు. 'మా బాబు కదూ! మా తల్లి కదూ' అంటూ తల్లులచేత మేలుకొలుపు పాడించుకుని వెంగున మంచాల మీంచి గెంతి దొడ్లలోకి పరుగెత్తుతున్నారు. ఇంత కచ్చికతో పళ్ళు తోముకుని తాటాకుతో నాలిగ్గీసుకుని మొహం మీద చెంబెడు నీళ్ళు కొట్టుకుని తుడుచుకో కుండానే చద్దన్నాలకి వంటింట్లో చేరుతున్నారు.

నాలుగేళ్ళు నిండని చిట్టి దొడ్లో పాలు తాగి చెంగనాలు పెడ్తున్న లేగదూడతో ఆడుకుంటోంది. దాంతోపాటే పరుగులు తీస్తూ దానిచేత వాళ్ళు నాకించుకుంటూ కిలకిలా నవ్వుతోంది. "ఒసే చిట్టీ! అన్నం తినవా? బడికెళ్ళవా?" అని తల్లి కేకేస్తే "అన్నం వొద్దు... బడికెల్తా" అంటూ పరుగెత్తుకొచ్చింది చిట్టి. చిట్టినింకా బళ్ళో వెయ్యలేదు. అయినా అన్నయ్య సోముతోను, అక్క బాలతోను రోజూ బడికెళ్తుంది. "చద్దన్నం తింటే కడుపు చల్లబడుద్ది. కూర్చో" అంటూ చిట్టిని కూర్చోబెట్టింది తల్లి. బాల అప్పటికే అన్నం ముగించి పుస్తకాలు సర్దుకుంటోంది. సోముకి చదువుకంటే తిండి ధ్యాసే ఎక్కువ. అన్నం ముందునుంచి ఎంతసేపటికీ లేవడం లేదు. బాల విసుక్కుంటూ "తింటూ కూర్చో ఒక్కో క్లాసు రెండేళ్ళు చదువుదుగాని" అంది. సోము కిందటేడు తప్పాడు.

గడ్డ పెరుగు రెండోసారి కలుపుతూ సోము అన్నాడు "అక్కా! కడుపునిండా తింటేగాని చదువు వొంటబట్టదన్నారే పంతులుగారు. అయినా ఆడదానికి నీ కెందుకే చదువు"– ఆడపిల్లకి చదువక్కర్లేదు సరే, తనకి చదువెందుకొర్లో చెప్పడు సోము.

"బండ వెధవ" తిట్టింది బాల.

పక్కింట్లో గోపీ వెన్నముద్ద వేస్తేనేగాని తిననని మారాం చేస్తున్నాడు. అవతలింట్లో రాము ఆవకాయ ముక్క కోసం అల్లరి చేస్తున్నాడు. ఆపై ఇంట్లో వెంకు వాళ్ళమ్మ చూడకుండా నేతిగిన్నె సొంతం కంచంలో బోర్లించుకుంటున్నాడు. ఆ చివరింట్లో శేషు పెరుగొద్దు నాకు పులి మజ్జిగే కావాలని పట్టుబడ్తోంది. ఇలా అందరిళ్ళలో చద్దన్నాల రంగం ముగిశాక చక్రకేళీలు, జీళ్ళు కొనుక్కోడానికి తల్లుల దగ్గర డబ్బులు తీసుకొని వీథిలోకొచ్చారు. ఒరే వెంకూ, సీతా, రమా, పొట్టీ! ఇంటింటికీ వెళ్ళి నేస్తాల్ని పిలుచుకుని పాతికమందికి పైగా పిల్లలు బడికి బయలుదేరారు. జారిపోతున్న బొందు లాగూలు పైకి లాక్కుంటూ పుస్తకాల సంచులు ఒక భుజం మీంచి ఒక భుజం మీదికి మార్చుకుంటూ ముందుకు నడుస్తున్నారు.

సోము 'అక్కరకురాని చుట్టము... అక్కరకు...' పద్యం మననం చేసుకుంటున్నాడు. పద్యం అప్పజెప్పకపోతే పంతులు గోడకుర్చీ వేయిస్తాడు. "అక్కరకు రాని... ... ..." గింజుకుంటున్నాడు. "ఒరేయ్ కిట్టి అక్కరకురాని చుట్టము... తర్వాత చెప్పరా" అని బతిమిలాడాడు. కిట్టిగాడు "అమ్మ ఆశ! నిన్న జీళ్ళు కొనుక్కుని నాకు పెట్టావేం! నేనేం చెప్పను" అన్నాడు.

"ఇవ్వాళ పెడ్తాగా" అన్నాడు సోము.

"ఒట్టు"

"ఒట్టు" చేతిలో చెయ్యివేసి గిచ్చాడు సోము.

వీథి చివర సాలె రంగమ్మ నూలు ఆరేసింది. ఈ పిల్లమూక రావడం చూసి కర్ర ఝళిపిస్తూ 'ఓహోయ్' అంటూ వచ్చింది. పిల్లలకు ఆ నూలు తాకుతూ పోవడం ఓ సరదా. రంగమ్మ 'ఓహోయ్' అనగానే పిల్లలంతా 'ఓహోయ్' అని అరుస్తూ ముందుకు పరుగెత్తారు. ఆ పరుగెత్తుతున్న పిల్లల వెనక చిట్టి. చిట్టిని బళ్ళో వెయ్యకపోయినా సంచి మాత్రం మహా బరువు. అందులో వాళ్ళన్నయ్య చదివేసిన పుస్తకాలు, విరిగిన పలకలు, బెచ్చాలు, లక్కపిడతలు, సుద్ద ముక్కలు, అచ్చనగాయలు, చిన్న బొట్టుపెట్టె, అందులో కొయ్య బొమ్మలు, వాటి చీరలు అన్నీ వున్నాయి. ఆ సంచీ బరువు మోయలేక ఒక్క పక్కకు వాలిపోయి మాటి మాటికీ భుజం మార్చుకుంటూ ఆయాసంగా పరుగెత్తుతోంది అందరితోటే.

మొదటి ప్రాకారం గేటు దగ్గర పిల్లలంతా ఆగారు. ఆ గేటు తలుపు ద్వారంలో గుర్రపు స్వారీలా కొందరు కూర్చోడం, మిగతావాళ్ళు గేటుని అటూ ఇటూ తిప్పడం, ఆ ఆట కొంతసేపు ఆడి గాలిగోపురం దగ్గరకొచ్చారు. మంటపంలో గంగన్న తాత బడికెళ్ళే పిల్లలకోసమే ఎదురు చూస్తున్నాడు. పొద్దున్నే స్నానంచేసి విభూతి పెట్టుకుని తంబురా మీటుకుంటూ ఈ చిన్నారి దేవుళ్ళని పలకరించిగాని గుళ్ళోకి వెళ్ళడు. ఒక్కొక్కరే గంగన్నతాతతో "బడికెల్తన్నాం తాతా" అని చెప్తుంటే 'మా నాయనే', 'మా తండ్రే' అంటూ అందరికీ విభూతి పెడ్తున్నాడు. అందరికంటె ఆఖర్న చిట్టి 'నేనూ బడికెల్తన్నా' అంటూ గంగన్నతాత దగ్గరకొచ్చింది. 'మా తల్లే' అంటూ చిట్టిని దగ్గరికి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు. వెండి తీగల్లాంటి గంగన్న మీసం పాలబుగ్గల చిట్టికి గిలిగింతలు పెట్టగా విడిపించుకుని పరుగు పరుగున వెళ్ళి మిగతా వాళ్ళని కలిసింది.

బళ్ళో సిరి చుక్క పెట్టించుకుని ఎవరి క్లాసుల్లో వాళ్ళు కూర్చున్నారు. పంతులు చూడకుండా ఇంటి నుంచి తెచ్చుకున్న మరమరాలు పాకం చుద్ద నములుతున్నారు.

పది గంటలయింది. పశువులు బీళ్ళకి లంకలకి మేతకెడుతున్నాయి. పెద్దబజారు నిండా పశువులు. చిట్టి బజారువైపే చూస్తోంది. మళ్ళీ మళ్ళీ చూస్తోంది. ఆ! వచ్చింది లేగదూడ! లేగదూడ సరాసరి వచ్చి బడి ముందు నుంచుంది. పాలేరు అదిలించినా ముందుకు సాగదు. లేగదూడని చూడగానే చిట్టి చేతనున్న పలకతో బజార్లోకి పరుగెత్తుకొచ్చింది.

లేగదూడ చిట్టి చేతులూ, వొళ్ళూ నాకుతుంటే చిట్టి తన పలక మీద పిచ్చి గీతలు చూపిస్తూ లేగదూడకి చెప్తోంది. "ఇది అ... ఆ... ఇవి వొంట్లు ... ఒకటి...రెండు, ఇది నీ బొమ్మ... అది నా బొమ్మ. ఇది అమ్మ బొమ్మ... సాయంత్రం తొరగా రా" అంటూ చిట్టి ఏదో చెప్తుంటే లేగదూడ చూసి చూసి సర్ సర్‌మని పలక్కి ఇటు పక్కా అటుపక్కా నాకేసి చెంగున తల్లిని కలుసుకోడానికి పరుగుపెట్టింది.

బళ్ళో వెయ్యని పసిపాపకంటె, నోరులేని లేగదూడకంటె చాలా చదువుకున్నాం మనం. కాని ...
... ... ... ...

# ముత్యాలవాన

## జోకులు చెవిలో పువ్వులు

